హోలీపై ఆంక్షలు తొలగించాలి



కాచిగూడలోని బజరంగ్‌సేన కార్యాలయం లో మాట్లాడుతున్న ఎన్‌ఆర్ లక్ష్మణ్‌రావు

కాచిగూడ: హిందువులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే హోలీ పండుగపై ఆంక్షలు తొలగించాలని లేదంటే రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయం, గాంధీభవన్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలంగాణ బజరంగ్ సేన అధ్యక్షుడు ఎన్‌ఆర్ లక్ష్మణ్‌రావు హెచ్చరించారు. గురువారం కాచిగూడలోని బజరంగ్‌సేన రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇతర మతాల పండుగలపై లేని ఆంక్షలు కేవలం హిందువుల పండుగలపైనే ఎందుకని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలను మానుకోవాలన్నారు. లేదంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన నాయకులు శ్రీనివాస్‌గుప్తా, అభినయ్ తివారి, మనోజ్, ప్రవీణ్‌యాదవ్, నరేష్, అశ్విన్, సాయినాథ్, పాల్గొన్నారు.

15న రజకుల జన శంఖారావం ఆత్మగౌరవ సభ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన రజకుల జన శంఖారావం ఆత్మగౌరవ సభను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ గురువారం ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు రాజకీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. జీవో నంబర్ 343ని అమలు చేస్తూ చెరువులో చేపలు పట్టుకునే హక్కును కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆత్మగౌరవ సభను రజకులంతా జయప్రదం చేయాలని రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆమనగంటి సైదులు రజక పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు నేర్నకంటి రాజశేఖర్ పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధి మహిళలతోనే సాధ్యం

చిక్కడపల్లి: సమాజ అభివృద్ధి మహిళలతోనే సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి సముద్రల వేణుగోపాలాచారి అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని త్యాగరాయ గానసభలో నిర్వహించిన మహిళా శిరోమణి–2025 అవార్డు ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతర సామాజిక చైతన్యంలో మహిళల పాత్ర గొప్పదన్నారు. తొలుత రమణారెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు డి.చక్రపాణి, పి.మాలిని, వేముల రాధికాసురేందర్‌రెడ్డి, అర్చన, స్వాతి, సుధా, ఎస్.ఇందిరా, డాక్టర్ ప్రతిభారాజ్‌గౌడ్, జి.కృష్ణ, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది నియంతృత్వ పాలన

ముషీరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను హరించడమే కాకుండా అసెంబ్లీలో సైతం ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కుతూ నియంతృత్వ పాలన సాగిస్తోందని బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళం విప్పి, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ప్రశ్నించిన ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ఈ చర్యను నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ఇతర ఎమ్మెల్యేలు, కార్యకర్తలను బలవంతంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శివముదిరాజ్, సుధాకర్‌గుప్తా, ప్రభాకర్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కాచిగూడ: ట్రైనర్లు సమాజంలో మార్పునకు అత్యంత కీలకమైన వ్యక్తులని, నాణ్యత గల శిక్షకుల అవసరం ప్రతి రంగంలో ఎంతో ముఖ్యమని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. మోతుకూరి రాంచందర్ పేర్కొన్నారు. గురువారం హైదర్‌గూడలో నిర్వహించిన ‘ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్’కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌతం నంది, డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి, డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ శ్రీపూజ, జగదీశ్వర్‌రావు, వేణుగోపాల్, డాక్టర్ రవి సిద్దుల, లక్ష్మణ్‌కుమార్, సదాశివ రెడ్డి, బాలసుబ్రమణ్యం, లక్ష్మీ సౌజన్య, వసుంధర, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

హోలీ.. సరదాల రంగేళి!



సంతోషాల సంబరాలకు కుర్రకారు రెడీ

సందడి వెనుక ప్రమాదం.. జరభద్రం

నిపుణుల సూచనలు పాటిస్తే సరి..

కాచిగూడ: రంగుల లోకంలో విహరించే కుర్రకారు కలల పండగ హోలీ. సరదాలన్నీ ఒక్కచోట కుమ్మరించినట్లుగా ఉరకలెత్తే ఉత్సాహంతో ఇంద్రధనస్సు వన్నెలన్నీ తమవేనంటూ సంబరాలు జరుపుకొంటారు. ఏటా వచ్చే సంబరమే అయినా ప్రతిసారీ కొత్తదనమే. రంగులన్నీ కనువిందు చేసేవే. సంతోషాల విందును ఆస్వాదించేందుకు అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు సిద్ధమయ్యారు.

సప్త వర్ణాల సంబరానికి సమయం వచ్చింది. సరదాల రంగేళి.. హోలీ.. సందడి తెచ్చింది. ఇక వీధులన్నీ రంగుల పరవళ్లే.. బయటకొస్తే చాలు రంగు పడుద్ది.. అంటూ వెంటపడతారు.! పక్కవారిని రంగుల్లో ముంచి.. తేల్చే ఆ ఉత్సాహానికి అలుపన్నదే రాదు. ఆహ్లాదాన్ని పంచే ఆకుపచ్చ.. ఆనందాన్ని రెట్టింపు చేసే ఎరుపు.. స్నేహాన్ని బలోపేతం చేసే నీలం.. అన్నీ కలగలిపి వర్ణశోభితమవుతుంది. ఈ హోలీ వేళ.. రంగుల సంద్రంలో తేలే ముందు మనమూ కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే ఈ సంతోష క్షణాలను పదికాలాల పాటు జ్ఞాపకాల్లో దాచుకోవచ్చు.

రంగుల పండుగకు ఏర్పాట్లు

ఈనెల 14వ తేదీన హోలీ జరుపుకునేందుకు యువత రంగులు జల్లే పిచికారీ గన్స్ కొనుగోలులో నిమగ్నమైంది. పలు దుకాణాల్లో స్ప్రేట్స్ పిచికారీ గన్స్, ఫెర్‌ఫ్యూమ్ గన్స్, ఫోమ్ గన్స్, ప్రెజర్ గన్స్, పలు రకాల రంగులు, బెలూన్స్ కూడా అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా అంబర్‌పేటలోని పలు కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలు హోలీ వేడుకలకు రెడీ అయ్యాయి. ఆనందపు రుచులు చవిచూడటం మంచిదే కానీ దాని వెనుక ఉన్న ముప్పును గమనించమంటున్నారు వైద్య నిపుణులు.

- ఆనందంతో పాటు ఆరోగ్యమూ అవసరం



నారాయణగూడలో ఏర్పాటు చేసిన షాపు

- రసాయనాలు కలిపిన రంగులతో హోలీ ఆడితే కనుక వాటిని శరీరంపై ఎక్కువ సమయం ఉండనీయకండి. వెంటనే చల్లని నీటితో శరీరాన్ని శుభ్రం చేసుకోండి.
- ఎక్కువగా ఎరుపు, పింక్ రంగులనే హోలీ కోసం వాడండి. ఇవి తక్కువ గాఢత కలిగి ఉండడం వల్ల శరీరంపై ఉండి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఎల్లో, ఆరంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉన్న కారణంగా సులభంగా శరీరంపై నుంచి తొలగిపోవు.
- హోలీ ఆడటానికి ముందు మీ ముఖానికి మాయిశ్చరైజర్‌ని, తలకు నూనెను రాసుకోండి. దీనివల్ల రంగులు శరీరంలోకి ఇంకవు. రంగులను శుభ్రం చేయడం కూడా సులభమవుతుంది.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైనది.
- చాలా మంది రంగుల్లో వివిధ ఆయిల్స్ కలిపి రాస్తూ ఉంటారు. ఈ కారణంగా రంగులను శుభ్రం చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. అందుకే రంగుల్లో ఎటువంటి ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడితే నీటి వృథాను అడ్డుకోవచ్చు.

రసాయన రంగులతో ప్రమాదం



ప్రమాదకరరమైన రసాయనాలతో కంటి వెలుగును కోల్పోయే అవకాశం ఉంది. ప్రకృతికి హాని కలిగించే విషతుల్యమైన రంగులు శరీరానికి హానీ చేస్తాయి కొన్ని రకాలైన చర్మవ్యాధులు దరిచేసే అవకాశం ఉంటుంది. రంగులు కళ్లలో పడితే ప్రమాదం. ఒకవేళ కంటిలో పడితే వెంటనే శుభ్రమైన నీటితో కడగాలి. హోలీ ఆడేటప్పుడు శరీరానికి కొబ్బరినూనె పూసుకోవడం మంచిది. సహజ సిద్ధమైన రంగులే వాడాలి.

– ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి



దుకాణాల్లో పేర్లు(మిఠాయి దండలు), రంగులను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

యాడాదికొక్కసారి హోలీ.. చమకేళీల హోలీ

చిన్నారులను ఆకర్షిస్తున్న వివిధ రకాల రంగులు చల్లే సామగ్రి



ముషీరాబాద్: హోలీ పండుగ అంటేనే చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ కలిసిమెలిసి ఉత్సాహంగా రంగులు చల్లుకునే పండుగ హోలీ. ముషీరాబాద్ నియోజకవర్గంలో హోలీ సంబరాలు. ఒక్క రోజు ముందుగానే మొదలైంది. హోలీ పండుగ సందర్భంగా ఫుట్‌పాత్‌లపై తాత్కాలికంగా వెలిసిన దుకాణాలు, షాపుల ముందు ఏర్పాటు చేసిన రకరకాల రంగులను ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. వివిధ రకాల రంగులను ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి రూ 10 నుంచి రూ.20 వరకు విక్రయించారు. కిలో రంగు ప్యాకెటు రూ.60 నుంచి 120 రూపాయల వరకు విక్రయించంఆరు. చిన్న చిన్న డబ్బాలలో సైతం గులాల్ రంగును ప్యాక్ చేసి రూ.10 నుంచి రూ.100 విక్రయించారు. ముఖ్యమంగా రంగునీళ్లు పిచికారీ చేసేందుకు తుపాకి, బెలున్స్, డబ్బాలను రూ.60 నుంచి రూ.200 వరకు విక్రయించారు. స్పైడర్ మెన్, వాటర్ బాటిల్, ఏక్ 47 తదితర రూపాలలో ఉన్న ఆట పరికరాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.

హెర్బల్ రంగులు విక్రయం...

సహజసిద్ధంగా తయారు చేసిన హెర్బల్ రంగులు ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి 250 గ్రాముల నుంచి కిలో ప్యాకేజీ వరకు విక్రయించారు. గులాల్ రంగులో ఉండే హెర్బల్ కలర్లను ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు.



రంగుల ధరలు పెరిగాయి



రంగుల ధరలు భారీగా పెరిగాయి. బేగం బజార్ నుంచి కిలోల చొప్పున తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నాం. ధరలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు రంగులను తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పిల్లల ఆట పరికరాలు ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి.

– శ్రీనివాస్, వ్యాపారి రాంనగర్


చేనేత అభివృద్ధికి రూ.2వేల కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చేనేత అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయిచాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో చేనేత, పవర్ లూమ్ కార్మికులకు ఉపాధి, సంక్షేమ పథకాలు అమలు కాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. సంవత్సర కాలంగా 32మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని దీనిని బట్టి చూస్తే నేతన్నల సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన వస్త్రాలను ఉత్పత్తి చేయించడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించవచ్చని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వాగ్దానాల పేరుతో కాలయాపన చేయడం తప్పా ఆచరణలో పెట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వనం శాంతి కుమార్, నాయకులు కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వర్గాలకు తీన్మార్ మల్లన్న మద్దతు



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సత్కరిస్తున్న డాక్టర్ చిక్కా దేవదాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చేనేత వర్గాలకు పూర్తిగా అండగా ఉంటామని వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. చేనేత వర్గాల చేనేత వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు గురువారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో విలేకరుల సమావేశంలో దేవదాసు మాట్లాడారు. చేనేత సమస్యలపై శాసనమండలిలో మాట్లాడుతామని తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇటీవల చేనేత మగ్గాన్ని అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే చేనేతలకు క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలలో చేనేతకు రూ.2వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టాలన్నారు. రూ.33కోట్ల రుణమాఫీ హామీ వెంటనే అమలయ్యేలా జీవో ఇవ్వాలని చిక్కా దేవదాస్ డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సహకార సంఘాలపై ఎందుకు చిన్న చూపు చూస్తున్నారో స్పష్టం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బి. గీత, పూరపాటి సుమలత, చింతకింది సుజాత, గుమ్మా నరేందర్ తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి



మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: తెలంగాణ బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కోరుతూ ఈనెల 19వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. గురువారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో అఖిలపక్ష ఎంపీల మద్దతు కూడగట్టడానికి చలో పార్లమెంట్‌ను 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చట్టసభలలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలన్నారు.

- విద్య, ఉద్యోగాలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు అంశాన్ని పరిశీలించాలన్నారు. బీసీ విద్యార్థులకు 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో ఓబీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు అంశంపై చర్చించాలన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నందగోపాల్, సుధాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వేటూరి ప్రభాకరశాస్త్రి యాదిలో..

చిక్కడపల్లి: సంస్కృతం, ఆంధ్ర భాషల్లో సమ పాండిత్య ప్రతిభగల వేటూరి ప్రభాకరశాస్త్రి తెలుగు జాతికి శాశ్వత సాహిత్య సంపద అందించారని తెలంగాణ పౌర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డా. ఆయాచితం శ్రీధర్ అన్నారు. గురువారం సాయంత్రం త్యాగరాయ గానసభలో వేటూరి ప్రభాకరశాస్త్రి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయులను చరిత్రలో మరుగున పడకుండా వారి జయంతి, వర్ధంతులను నిర్వహించాలన్నారు. విశ్వవిద్యాలయాలు సాహిత్య అకాడమీలు చేయాల్సిన పనిని గానసభ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ గాయని శ్రీదేవి, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సంఘ సేవకులు పీఎస్ఎన్ మూర్తి, దేవసేన పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించని ఆస్పత్రిపై కొరడా

గడువు ఇవ్వాలని కోరడంతో సీజ్ చేసిన కంప్యూటర్లను ఇచ్చేసిన అధికారులు



కాచిగూడ: ఆస్తి పన్ను చెల్లించలేదని కాచిగూడలోని ప్రతిమ ఆస్పత్రిలోని కంప్యూటర్లు, ఇతర వస్తు సామగ్రిని జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం సీజ్ చేశారు. తర్వాత ఆస్పత్రి యాజమాన్యం స్పందించి కొంత గడువు కోరడంతో ఆస్పత్రిలో అతికించిన నోటీసులను జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది తొలగించారు. రెండు సంవత్సరాల ఆస్తి పన్ను చెల్లించాలని గతంలో అధికారులు నోటీసులు జారీ చేసినా ఆస్పత్రి యాజమాన్యం ఏమాత్రం స్పందించలేదు. దీంతో జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రతిమ ఆస్పత్రికి చేరకుని కంప్యూటర్లు, ప్రింటర్లు, ఫర్నిచర్‌ను సీజ్ చేశారు.

- ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. చివరిసారిగా గత నెల ఫిబ్రవరిలో నోటీసులు జారీ చేశామని అయినా యాజమాన్యం స్పందించలేదన్నారు. రెండు సంవత్సరాల ఆస్తిపన్ను రూ.37,37,713 చెల్లించాల్సి ఉందన్నారు. అస్పత్రికి ముందుగా నోటీసులు కూడా అంటించామని తెలిపారు. అయితే ఆస్పత్రి నిర్వాహకులు మూడు రోజుల గడువు ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరడంతో అంగీకరించారు. ఆస్పత్రి యాజమాన్యం ఆస్తిపన్ను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సీజ్ చేసిన కంప్యూటర్లు, ఇతర పరికరాలను అధికారులు తిరిగి ఆస్పత్రి యాజమాన్యానికి అప్పగించారు.

కవయిత్రి మొల్లను ఆదర్శంగా తీసుకోవాలి

తెలంగాణ కుమ్మర సంఘం అధ్యక్షుడు నేజునూరి కనకయ్య




ట్యాంక్‌బండ్‌పై కవియిత్రి మొల్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నేతలు

కవాడిగూడ: ఆధ్యాత్మికత, మానవత విలువలకు.. మహిళా సాధికారతకు నిదర్శనం కవయిత్రి మొల్ల అని తెలంగాణ రాష్ట్రీయ కుమ్మర సంఘం అధ్యక్షుడు నేజునూరి కనకయ్య అన్నారు. గురువారం కవయిత్రి మొల్ల జయంతిని పురస్కరించుకొని ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆమె విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. అనంతరం నేజునూరి కనకయ్య మాట్లాడుతూ... కవయిత్రి మొల్ల 15వ శతాబ్దంలోనే సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని తెలుగు భాషలో అనువదించి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించినట్లే మొల్ల జయంతిని సైతం నిర్వహించాలని డిమాండ్ చేశారు. భారత సాహిత్య రంగంలో మొల్ల సాహిత్య ప్రభావాన్ని ప్రచారం చేయాలని డిమాండ్ చేశారు. నేటి సమాజం మొల్లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారులు టి.యాదగిరి, మువ్వల అశోక్, లక్ష్మీనారాయణ, రాజేందర్, జగన్, మల్లేశం, డాక్టర్ రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల అభివృద్ధికి కృషి

చిక్కడపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. గురువారం జవహర్‌నగర్ కవేలి గ్రాండ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పేరుతో ఉన్న బోర్డును ఆమె ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. నీవి చారిటబుల్ సంస్థ ద్వారా డివిజన్‌లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం మేడే దేవదాస్, ఉపాధ్యాయులు సౌజన్య, మెరిబా, నాయకులు నవీన్‌ముదిరాజ్, శ్రీకాంత్, నర్సింగ్ రావు, ఉమేష్, ఆకుల సురేందర్, ఆనంద్‌రావు, సాయికుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో

కనీస వేతనాలు అమలు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణలోని షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లోని 5రంగాలకు 2021లో ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్‌కు వెంటనే గెజిట్ చేయాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. మిగిలిన 68 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లలో కనీస వేతనాలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని కోరారు. కనీస వేతనాల చట్టం 1948 ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి పెంచాల్సి ఉందన్నారు. అయితే ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని అన్నారు.

- ఈ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేసే ఉద్దేశం లేదని విమర్శించారు. 2024 జనవరిలో 73షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌కు కొత్తగా గతంలోని బేసిక్ డీఏలను కలిపి కొత్త వేతనాలు నిర్ణయించి డ్రాఫ్టులు విడుదల చేసిందన్నారు. అయితే 2021 నాటి 5జీఓల కన్నా తగ్గించి నిర్ణయించడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు రెబ్బరామారావు, ఏఐటీయూసీ నాయకులు ఎండీ యూసఫ్, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎంకె బోస్, సీఐటీయూ నాయకులు మల్లికార్జున్, ఎ. వెంకటేష్, ఎస్ రమ, జయలక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకులు జి. అనురాధ తదితరులు పాల్గొన్నారు.